# కెంపి పక్షు పీర

మా వూళ్ళో రత్తమ్మ పేరు వినని వాళ్ళెవ్వరూ లేరు. "పాలరత్తమ్మ" అంటే పసిపిల్లలకూడా తెలుసు. నాకు ఊహవచ్చింది అగాయతూ ఆవిడ పాలవ్యాపారంమీదే బ్రతుకుతూన్నది; పదిమంది కుటుంబాన్ని బ్రతికిస్తోన్నది.

"పాలల్లో నీళ్ళు కలపడం" అనేది పాలవ్యాపారంలో వున్న ప్రధానమైన, బహిరంగమైన వ్యాపార రహస్యం. ఆ రహస్యాన్ని తన వ్యాపారంలో ప్రధానోద్దేశ్యంగా పెట్టుకున్న రత్తమ్మ ఇరవై యేళ్ళల్లో లక్షరూపాయల ఆస్తిని ఇట్టే సంపాదించింది. అయినా ఇప్పటికీ ఆ వ్యాపారాన్ని విడిచిపెట్ట లేదు. ఆవిడ వేష భాషల్లో రవ్వంత మార్పు రాలేదు. ఈ నాటికీ - ఆ అణకువా, మాటకారి తనము, లాలన, చాకచక్యము - సొక్కు తగ్గకుండా ఆవిడలో వున్నాయి. మా వూరి పాలవ్యాపారాన్ని ఆవిడే పూర్తిగా గుత్తకు తీసుకున్నది. హోటళ్ళకూ, ఉపాధ్యాయులకూ, ఉద్యోగులకూ - ఆవిడే సూర్యుని దర్శనానికి ముందే పాలు సప్లయి చేస్తుంది.

రత్తమ్మ రకరకాలైన వ్యక్తులకు రకారకాలైనపాలు రక రకాలైన ధరలకు సరఫరా చేస్తుంది. శానిటరీ ఇన్‌స్పెక్టరూ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరూ, గవర్నమెంటు డాక్టరూ పంచాయతీ బోర్డు ప్రెసిడెంటూ మొదలైన వారికి మేలురకమైన పాలను (అంటే నూటికి పదివంతులు మాత్రమే నీళ్ళుకలిపినవి) హోటళ్ళకూ, ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకూ నీళ్ళపాలనూ (అంటే మూడింట ఒకవంతు నీళ్లుకలిపినవి) ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయులకూ, లోయర్ డివిజన్ గుమాస్తాలకూ, మరికొంతమంది సన్నజీవాలకూ పాలనీళ్ళనూ (అంటే మూడింట రెండువంతులు నీళ్ళుకలిపినవి) సప్లయి చేస్తుంది. పైపెచ్చు "నా వ్యాపారంలో మోసమేమీ లేదు. మేలురకమైన పాలు సేరు ఒక్కరూపాయి. నీళ్ళపాలు ముప్పావలా, పాలనీళ్లు అర్థరూపాయి కొనేవారి తాహతుకొద్దీ అమ్ముతుంటాను" అంటుంది రత్తమ్మ కుండ బద్దలుకొట్టినట్టుగా.

మా వూళ్ళోకి కొత్తగా ఓ శానిటరీ ఇన్‌స్పెక్టరు వొచ్చాడు. అతను యువకుడు, భావాలు కూడా ఆ తరానికి చెందినవే. జీవితంలో కొన్ని ఆశయాల్ని ఏర్పరచుకొని, ఆదర్శాల్ని స్థాపించాలనే ఆవేశం గలవాడు. అతను కొత్త కాపురాన్ని మా వూరి ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టరు నివసించే ఇంట్లో ప్రక్క-భాగంలో పెట్టాడు. ఓ పక్షం రోజులకే శానిటరీ ఇన్‌స్పెక్టరుకూ, హెడ్‌మాష్టరుకూ మంచి స్నేహం కలిసింది.

ఒకరోజు సాయంత్రం వాళ్ళిద్దరూ ఇంటిమెల్లాపైకక్కెల్లో కూర్చుని మాట్లాడుకుంటూండగా రత్తమ్మ కూతురు రెండు చెంబులతో పాలు తీసికొచ్చింది. ఒక చెంబులో మేలురకమైన పాలు శానిటరీ ఇన్‌స్పెక్టరు గారికి. రెండో చెంబులో నీళ్ళ పాలు. ఎలిమెంటరీ స్కూల్ హెడ్‌మాష్టరు గారికి. రోజూ ఆ పిల్ల ఆ విధంగానే రెండు చెంబులతో రెండు రకాలైన పాలను తెస్తూన్నది. హెడ్ మాస్టరుగారికి ఆ పూట వచ్చిన దగ్గర్నుంచీ రత్తమ్మంటే వొంటికి కొత్త కారం రాసుకున్నటుంటున్నది. "పాలలో నీళ్లు అధికంగా కలుస్తున్నావి రత్తమ్మా!" అంటే "పాలకూ నీటికీ అనుబంధం ఎన్నో జన్మలనాటిది. అయినా మీరిచ్చే డబ్బులకు అంతకంటె గట్టిపాలు ఎలా వస్తాయి బాబూ!" అంటుంది. "శేరు రూపాయి తీసికొని మేలురకమైన పాలు తెచ్చిపెట్టమ్మా" అంటే, "అవి అందరికీ సప్లయి చేయడానికి లేవు. ప్రతివాళ్ళూ మేలురకమైన పాల కోసం అడిగే వాళ్లే! మరి నీళ్ళపాలు ఎవరికి పోసేట్టు!" అంటుంది తుస్కారంగా. ఆవిడను పాలు సప్లయి చేయవద్దని, వేరేవాట వాడకం పెట్టుకుందామని హెడ్ మాస్టరుగారు ఆలోచించాడు గాని, సంవత్సరం పొడుగునా నాగా లేకుండా పోసేవాళ్ళు కనబడ లేదు. అందుచేత ఆవిడఏమన్నా, తన మనస్సులో ఎంత ఉక్రోషంపొందినా కొసకు ఆవిడే గతిగాక తప్పలేదు. అయినప్పటికీ అక్కను తీర్చుకొనే సమయం కోసం వేచి ఉన్నాడు.

ఆ ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టరుగారు ఆ రెండు పాల చెంబులనూ చూపించి శానిటరీ ఇన్‌స్పెక్టరుగారికి, తనకు రత్తమ్మ సరఫరా చేసే నీళ్ళపాలను చూపెట్టాడు. "ఈ నీళ్ళ పాల వ్యాపారంలో రత్తమ్మ లక్షరూపాయలు గడించిందంటే ఆశ్చర్యపడ నక్కర లేదు. ఈ ఊరికి ఎంతమంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వచ్చినా ఆవిడను పట్టుకొని శిక్షించ లేదు. జైలుకు పంపలేదు. ఆవిడ చేసేకల్తీ వ్యాపారానికి హద్దూ, అదుపూ లేకుండా వుంది. మీలాంటి యువకులూ, నిష్పక్షపాతంగా వ్యవహరించే ధైర్యస్థులూ అవినీతికి పాల్పడని ఆదర్శమూర్తులూ శ్రద్ధగ జేసుకొని ఇలాంటివారి ఆట కట్టించాలి" అన్నాడు హెడ్ మాస్టరు రెచ్చగొడుతూ.

"సరే. ఈ రత్తమ్మ వ్యవహారం త్వరలో నేచూస్తాను" అన్నాడు శానిటరీ ఇన్‌స్పెక్టరు గంభీరంగా.

"మీవల్లనే కావాలి" అన్నాడు హెడ్ మాస్టరు వుంగొల్పుతూ.

మరునాడు ఉదయమే శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో బయలుదేరి ఒక హోటలుకు రత్తమ్మ నీళ్ళపాలు పోస్తుండగా పట్టుకున్నాడు. రత్తమ్మ తొణకలేదు. బెణకలేదు. నిగూఢంగా చిరునవ్వు నవ్వి వూరుకుంది. ఈ దెబ్బతో రత్తమ్మకు కల్తీ నిరోధకచట్టం క్రింద జైలు గోడలమధ్య నివాసం తప్పదనుకున్నారు ఊళ్ళోవాళ్ళు. ఆ విషయం హెడ్ మాస్టరుకు తెలిసి కడుపు నిండా సంతోషపడ్డాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వచ్చాడు శానిటరీ ఇన్ స్పెక్టరు. చిరునవ్వును చిందిస్తు భార్య ఆహ్వానించింది. ఆమెచిరు నవ్వు సహజమైందనుకున్నా గానీ—ఆచిరునవ్వులో ఎంతో ప్రత్యే కత వున్నదని భోజనం చేస్తున్నప్పుడుగాని గ్రహించ లేదు.

"మీరు ఇవాళ నా మాట ఒకటి వినాలి అన్నది శాని టరీ ఇన్ స్పెక్టరు భార్య వరప్రయోగం చేస్తున్నట్లై కేయివలె.

"ఇవాళ ప్రత్యేకతేముంది! నీమాటలురోజూ వింటూనే వున్నానుగా" అన్నాడు శానిటరీ ఇన్ స్పెక్టర్ భార్య సౌంద ర్యాన్ని చూపులతో ఆస్వాదిస్తూ. తన భార్య జగదేకసుందరి అన్న భావం, గర్వం, మోజు, ప్రేమ, అభిమానం ఆతనిలో నిండుగా వున్నాయి. ఆమె కోర్కెలకు ములక్కాడలా వొంగి పోతాడు.

భోజనం ముగించాక భర్తపక్కలో చేరి ఆప్యాయంగా తాంబూలం తినిపిస్తూ, "నేను చెప్పిన మాటకు మీ దగ్గర ఎదురు లేదు." అన్నదామె మృదు మధురంగా.

ఆమె చెక్కిళ్ళలో తన నీడల్ని చూసుకూంటూ "రామ బాణానికి తిరుగువుంటా !" అన్నాడు శానిటరీ ఇన్ స్పెక్టరు.

మనస్సులో మర్మాన్ని సిల్కు గడ్డముడి విప్పినట్టుగా చెప్పిందామె.

ప్రగతి శీలుడైన శానిటరీ ఇన్ స్పెక్టరు భార్యమాటలకు మొదలు నరికిన అరటి చెట్టులా కూలిపోయాడు. గొంతు లోని తాంబూలం గబుక్కున బయటికొచ్చింది.

"అవునండీ! రత్తమ్మెంతో మంచిది, మా అమ్మగారికి ముఖ్యులాలు. చిన్నప్పుడు వీధిబడిలో ఇద్దరూ కలిసి చదువు కున్నారట. ఇప్పటికీ మా వూరొచ్చినప్పుడల్లా మా ఇంటికి వస్తూవుంటుంది. మా అమ్మగారి సరసన కూర్చుని భోజనం చేస్తూ వుంటుంది, ఆమెమీద మీరు కేసు పెట్టడమూ నా మాటవిని కేసుపెట్టకండి. పదిగంటలకు నా దగ్గరకొచ్చి ఏడ్చింది, నా మనస్సు నీటి బుగ్గ అయింది—" అన్నది శానిటరీ ఇన్‌స్పెక్టరు భార్య జాలిగా, ప్రార్థనా పూర్వకంగా, లాలనగా.

భార్యపై పెంచుకున్న ప్రేమానురాగాల ఆధిక్యత అతని వ్యక్తిగత అభిప్రాయాల గోడను పెగలించి వేసింది. మొహం చిట్లించి, "సరే" అన్నాడు శానిటరీ ఇన్‌స్పెక్టరు.

ఆ రాత్రి తొమ్మిదిన్నర గంటలకు సిల్వరీ బోర్డరుగల మామిడి చిగురు రంగు కంచి పట్టుచీరను ధరించి, ముగ్ధ మోహనంగా అలంకరించుకొని, పడకగదిలోకి ప్రవేశించిన భార్యను చూసి – సంభ్రమాశ్చర్య చకితుడైనాడు శానిటరీ ఇన్‌స్పెక్టరు.

"ఈ కొత్తకంచి పట్టుచీరెక్కడిది. ఎప్పుడుకొన్నావ్!" అన్నాడు మొహంలో ఆశ్చర్యం ఆకాశమంతకాగా,

చిరుగాలి దొర్లినట్టుగా చిరునవ్వు నవ్వుతూ – "సాయంత్రం మా అమ్మగారు రత్తమ్మద్వారా పంపించింది." అన్నది శానిటరీ ఇన్‌స్పెక్టరు భార్య.